క్లుప్తంగా

మొయినాబాద్ ఎంఈఓగా శంకర్



ఎంఈఓ శంకర్‌ను సన్మానిస్తున్న వెంకటయ్య, ఎంపీడీఓ సంధ్య

చేవెళ్ల: మండల విద్యాధికారిగా కె.శంకర్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఫరూఖ్‌నగర్ నుంచి మొయినాబాద్ మండలానికి శంకర్ బదిలీపై వచ్చారు. 2009 నుంచి ఇప్పటివరకు సుమారు 15 సంవత్సరాల పాటు ఇన్‌చార్జి ఎంఈఓగా పనిచేసిన వెంకటయ్య శంకర్‌కు బాధ్యతలు అప్పగించారు. వెంకటయ్య ప్రస్తుతం కనకమామిడి హెచ్‌ఎంగా పనిచేస్తున్నారు. బాధ్యతలు చేపట్టిన ఎంఈఓ శంకర్‌ను మండల అభివృద్ధి అధికారి సంధ్య అభినందించారు. కార్యక్రమంలో కంప్యూటర్ ఆపరేటర్, మహేందర్, సీఆర్పీలు మల్లేశ్, అన్నపూర్ణ, అటెండర్ మల్లేశ్ తదితరులు ఉన్నారు.

దేవాలయ నిర్మాణానికి విరాళం



శ్యాంసుందర్‌రెడ్డిని కలిసిన ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు

షాద్‌నగర్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఆంజనేయస్వామి దేవాలయ నిర్మాణానికి బుధవారం కొత్తూరు జెడ్పీటీసీ మాజీ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు మామిడి శ్యాంసుందర్‌రెడ్డి రూ.50వేల విరాళం అందజేయనున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా దేవాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కక్కునూరి వెంకటేశ్ గుప్తా, అన్మారి వెంకటయ్య తదితరులు శ్యాంసుందర్‌రెడ్డిని కలిసి ఆలయ అభివృద్ధికి తమవంతు సహకారం అందించాలని కోరారు. అడగగానే వెంటనే స్పందించిన ఆయనకు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

దశలవారీగా అమ్మ అభివృద్ధి పనులు



పాఠశాల ఆవరణలో కొనసాగుతున్న తాగునీటి సంపు నిర్మాణ పనులు

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని ఎన్కెపల్లి ప్రాథమిక పాఠశాలలో దశలవారీగా అమ్మ ఆదర్శ అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నామని గ్రామ కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. పాఠశాలలో విద్యుత్ వర్క్ చేయించామని, అదేవిధంగా విద్యార్థులకు తాగునీటి సమస్య లేకుండా బుధవారం సంపు నిర్మాణ పనులు ప్రారంభించామని తెలిపారు. త్వరలో నూతన టాయిలెట్స్, బాత్‌రూమ్‌లను నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. పాఠశాలలో విద్యార్థులకు ఇబ్బంది లేకుండా మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.

యాదాద్రిలో ఎమ్మెల్యే పూజలు



ఎమ్మెల్యేకు ప్రసాదాలు అందజేస్తున్న పండితులు

షాద్‌నగర్‌రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం అయిన యాదాద్రి లక్ష్మీనర్సింహాస్వామి దేవాలయంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, అనురాధ దంపతులు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు ఎమ్మెల్యేకు స్వాగతం పలికి ఆశీర్వాదాలు అందజేశారు.

నందిగామ ఏఓగా వాణి



నందిగామ: మండల వ్యవసాయాధికారిగా వాణి బుధవారం బాధ్యతలు చేపట్టారు. రాజేంద్రనగర్‌లోని సాయిల్ టెస్టింగ్ కార్యాలయంలో పనిచేస్తున్న ఆమె నందిగామ మండల వ్యవసాయాధికారిగా బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఏఓ వాణి మాట్లాడుతూ.. రుణమాఫీ లిస్టులో పేర్లు రాలేని రైతులు నందిగామలోని రైతువేదిక వద్దకు వచ్చి తమను సంప్రదించాలని సూచించారు. అర్హులైన ప్రతీ రైతుకు రుణమాఫీ అందేందుకు కృషి చేస్తామని చెప్పారు. రైతు రుణమాఫీ లిస్టులో పేర్లు రాలేని రైతులు ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, బ్యాంకు అకౌంట్ నెంబరు తీసుకొని రావాలని సూచించారు.

‘సీజనల్’పై అప్రమత్తత తప్పనిసరి

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ విజయలక్ష్మి

షాద్‌నగర్: సీజనల్ వ్యాధులపై అప్రమత్తత తప్పనిసరి అని, ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత వైద్య సిబ్బందిపై ఉందని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి ఆరోగ్య సిబ్బందికి సూచించారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రిలో షాద్‌నగర్ డివిజన్ పరిధిలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు, డీఈఓలు, ఏఎన్‌ఎంలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ.. చిన్నారులకు ప్రతి బుధ, శనివారాల్లో విధిగా వ్యాధి నిరోధక టీకాలు ఇవ్వాలని, గ్రామాల్లో షుగర్, బీపీ వ్యాధిగ్రస్తులను గుర్తించి వాటికి మందులు అందజేయాలన్నారు. ఏఎన్‌ఎంలు గ్రామాల్లో గర్భిణులను గుర్తించి వారి వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. గర్భిణులు రక్తహీనత బారినపడకుండా ఐరన్ మాత్రలు, టీటీ వ్యాక్సిన్‌లు ఇవ్వాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసూతుల సంఖ్య పెంచే విధంగా ఆరోగ్య సిబ్బంది కృషి చేయాలని సూచించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు వ్యాధుల బారిన పడే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను గ్రామాల్లో ప్రజలకు వివరించాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు సామాల మహేందర్‌రెడ్డి



నూతన కార్యవర్గ సభ్యులకు నియామకపత్రం అందజేస్తున్న మహేందర్‌రెడ్డి

మొయినాబాద్‌రూరల్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ సంఘం ఎల్లప్పుడూ కృషి చేస్తోందని జిల్లా అధ్యక్షుడు సామాల మహేందర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కన్నయ్యగారి గోవర్ధన్‌యాదవ్‌లు పేర్కొన్నారు. మండల పరిధిలోని హిమాయత్‌నగర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో పీఆర్టీయూ మండల సంఘం నూతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మొయినాబాద్ మండల కార్యవర్గాన్ని జిల్లా బాధ్యులు ఎన్నుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి సంఘం ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. 2024–26 సంవత్సరాలకుగాను మొయినాబాద్ మండల పీఆర్టీయూ నూతన కార్యవర్గంలో మండల అధ్యక్షుడిగా జక్కని బందయ్య, ప్రధాన కార్యదర్శిగా మల్లెపల్లి నరేందర్‌రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని తెలిపారు. అదేవిధంగా మండల అసోసియేషన్ అధ్యక్షుడిగా రాములు, మహిళా అసోసియేషన్ అధ్యక్షురాలిగా మంజుల, మహిళా కార్యదర్శిగా విజయబాయి, కార్యదర్శిగా మహేందర్ ఎన్నికయ్యారు. ఈమేరకు వారికి జిల్లా అధ్యక్షుడు సామాల మహేందర్‌రెడ్డి, కార్యదర్శులు కలిసి నియామకపత్రం అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర పత్రిక సంపాదక వర్గ సభ్యుడు కృష్ణారెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు సత్యనారాయణరెడ్డి, నరేందర్, యాదగిరి, రాష్ట్ర ఉపాధ్యక్షులు సంజీవ్‌కుమార్, బీమ్లానాయక్, లక్ష్మణ్, జంగయ్య, అంజనేయులు, వెంకటయ్య, రాములు, కృష్ణా, వినోద్‌కుమార్, రాములుగౌడ్, నారాయణగౌడ్, సిద్ధం శ్రీనివాస్, రవినాయక్, సులోచన, విజయబాయి, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

కాలుష్యంతో పంటలు దెబ్బతింటున్నాయి

పరిశ్రమపై చర్యలు తీసుకోవాలని రైతన్నల వినతి



వరిపైరును చూపుతున్న రైతులు

కొందుర్గు: కొందుర్గు శివారులో గోదావరి సెల్మార్ట్ పరిశ్రమ నుంచి వెలువడుతున్న కాలుష్యం ద్వారా పంటలు దెబ్బతింటున్నాయని రైతన్నలు వాపోయారు. బుధవారం పరిశ్రమ చుట్టూ పంటలు సాగుచేసిన బాధిత రైతులు దెబ్బతిన్న వరిపైరును చూపుతూ తమ బాధను వెలిబుచ్చారు. వేల పెట్టుబడి పెట్టి సాగుచేసిన వరి, పత్తి, మొక్కజొన్న, కూరగాయల పంటలు కాలుష్యం బారినపడి దెబ్బతింటున్నాయని వాపోయారు. ఎకరం పంట సాగుచేయడానికి దాదాపు రూ.50వేల వరకు ఖర్చు చేశామని, ప్రస్తుతం చీడపీడలకు గురై పంటలు ఎర్రగా మారాయని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అధికారులు స్పందించి తమ పంటలను కాలుష్యం బారి నుంచి కాపాడాలని, సదరు పరిశ్రమ నిర్వాహకులపై తగు చర్య తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతులు రాయికంటి వెంకటయ్య, జగదీశ్వర్ గౌడ్, కోతి వెంకటయ్య, నాయకులు కృష్ణారెడ్డి, రామయ్యగౌడ్, మానయ్య, కృష్ణయ్య, రామచంద్రయ్య, సత్యనారాయణరెడ్డి, మల్లయ్య, నరేందర్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

నోడల్ అధికారుల నియామకం

షాద్‌నగర్: ప్రభుత్వం ప్రతీ మండలంలో రైతుల రుణమాఫీ సమస్యలకు సంబంధించిన వినతిపత్రాలు స్వీకరించి వాటిని పరిష్కరించేందుకుగాను జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి గీతారెడ్డి నోడల్ అధికారులను నియమించారు. ఈ నోడల్ అధికారులు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వ్యవసాయశాఖ కార్యాలయాల్లో అందుబాటులో ఉండనున్నారు. రైతుల నుంచి స్వీకరించిన వినతిపత్రాల నివేదికను నోడల్ అధికారులు ప్రతి రోజు సాయంత్రం జిల్లా వ్యవసాయ అధికారులకు పంపించనున్నారు.

మండలం	నోడల్ అధికారి	ఫోన్ నెంబర్
కేశంపేట	శిరీష	7288894309
కొందుర్గు	శోభారాణి	7799255755
జిల్లేడు చౌదరిగూడ	రాజేందర్‌రెడ్డి	7288894897
కొత్తూరు	గోపాల్	7288894311
నందిగామ	వాణి	9581472988
ఫరూఖ్‌నగర్	నిషాంత్‌కుమార్	7288894308

ట్రాఫిక్‌రూల్స్ విధిగా పాటించాలి

నందిగామ: ప్రతిఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ విధిగా పాటించాలని ఎస్సై గోపాలకృష్ణ సూచించారు. మండల పరిధిలోని మేకగూడలో బుధవారం గ్రామస్తులకు ట్రాఫిక్‌రూల్స్‌పై ఆయన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ప్రతి వాహనదారులు తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలన్నారు. నిబంధనతోనే రోడ్డు ప్రమాదాలు నియంత్రించవచ్చని వివరించారు. అదేవిధంగా మైనర్లకు ఎట్టి పరిస్థితుల్లో వాహనాలు ఇవ్వొద్దని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపొద్దని తెలిపారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

రైస్‌మిల్లర్ల సంఘం జిల్లా అధ్యక్షుడిగా సతీశ్‌గుప్తా

కొత్తూరు: రంగారెడ్డి జిల్లా రా రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని ఇన్ముల్‌నర్వ గ్రామానికి చెందిన ఎస్.సతీశ్‌కుమార్‌గుప్తా ఎన్నికైనట్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లో నిర్వహించిన అసోసియేషన్ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు గణపతిరెడ్డి ఆధ్వర్యంలో కార్యవర్గం తనను జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. సంఘం తరఫున రా రైస్ మిల్లర్ల సమస్యలపై పోరాటం చేయడానికి, తనవంతు సహకారం అందించడానికి కృషి చేస్తానని వివరించారు.

వైద్యశిబిరం



రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కొత్తూరు: మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరం రెండోరోజు బుధవారం కూడా కొనసాగింది. ఇందులో భాగంగా గ్రామంలో జ్వరాలతో బాధపడుతున్న పలువురికివైద్యులు పరీక్షలు నిర్వహించారు. పరీక్షలు నిర్వహించిన వారు కేవలం జ్వరం, ఒంటి నొప్పులతో బాధ పడుతున్నట్లు వైద్యుడు హరికిషన్ తెలిపారు. గ్రామంలో మరో రెండురోజుల పాటు శిబిరాన్ని కొనసాగించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రజలు అనారోగ్యాలకు గురైతే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే చికిత్సలు చేయించుకోవాలని కోరారు. అంతేకాకుండా నిల్వ ఉన్న ఆహారాన్ని కాకుండా తాజా ఆహారంతో పాటు వేడిగా ఉన్నప్పుడే తినాలని సూచించారు. ఇళ్లలోకి దోమలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణతో అందరికీ సమన్యాయం

షాద్‌నగర్‌రూరల్: ఎస్సీ వర్గీకరణతో దళిత సామాజికవర్గంలోని అన్ని ఉపకులాలాకు సమన్యాయం జరుగుతుందని బుధవారం బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎంకనోళ్ల వెంకటేశ్ తెలిపారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ కొన్ని కుల సంఘాలు చేపట్టిన భారత్‌బంద్‌కు బీఎస్పీ మద్దతివ్వడం సుప్రీం కోర్టు తీర్పును వ్యతిరేకించడమేనని పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణతో ఎవరికీ నష్టం జరగదని, దళిత సామాజికవర్గంలోని అన్ని ఉపకులాలకు సమన్యాయం జరుగుతుందని వివరించారు. కొందరు వారి రాజకీయ స్వలాభం కోసం వర్గీకరణను పక్కదోవ పట్టిస్తున్నారని తెలిపారు. బహుజనుల పార్టీ, బడుగు బలహీన వర్గాలకోసం పనిచేసే పార్టీ అని చెప్పుకునే బీఎస్పీకి మాదిగ, మాదిగ ఉపకులాలపై ఉన్న కపట ప్రేమ బహిర్గతమైందని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో అన్ని రాజకీయ పార్టీలు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించాయని పేర్కొన్నారు.

బీఎస్పీని తరిమికొట్టండి

షాద్‌నగర్‌రూరల్: అగ్రకులాలకు కొమ్ముకాస్తున్న బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ)ని తరిమికొట్టాలని మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చిన్నోళ్ల అనంతయ్య బుధవారం తెలిపారు. బీఎస్పీ అణగారిన వర్గాలకు న్యాయం చేసే పార్టీ అనుకున్నాం కానీ అగ్రకుల నాయకులకు అనుకూలంగా మాట్లాడుతుందని పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు సరైనది కాదని చెబుతున్న బీఎస్పీ నాయకులు దానిని నిరూపించగలరా అని ప్రశ్నించారు. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తున్న బీఎస్పీలో ఉన్న మాదిగలు తక్షణమే రాజీనామా చేయాలని కోరారు. మాదిగల భవిష్యత్ కోసం 30 సంవత్సరాలు చేసిన అలుపెరగని పోరాటంలో ఎంతో మంది మాదగ బిడ్డలు అమరులయ్యారని, వారి పోరాట ఫలితంగానే ఎస్సీ వర్గీకరణ జరిగిందని తెలిపారు. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తున్న బీఎస్పీని గ్రామాల నుంచి తరిమికొట్టాలని కోరారు.

ఘనంగా హనుమాన్ దేవాలయ వార్షికోత్సవం



పూజలో పాల్గొన్న గ్రామస్తులు

చేవెళ్ల: మండలంలోని మల్లారెడ్డిగూడ గ్రామంలో బుధవారం హనుమాన్ దేవాలయ నాలుగో వార్షికోత్సవం సందర్భంగా ఆలయంలో అర్చకులు ఉదయం నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలోని పెద్దలు, ప్రజల పెద్దఎత్తున పూజల్లో పాల్గొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయం వద్ద హోమాలు, పూజలు, అన్నదాన కార్యక్రమాలు కొనసాగాయి.

డ్రగ్స్‌కు బానిస కావొద్దు

సీఐ భూపాల్‌శ్రీధర్

చేవెళ్ల: డ్రగ్స్ జీవితాలను నాశనం చేస్తాయని, మత్తు పదార్థాలను అలవాటు చేసుకోవద్దని చేవెళ్ల సీఐ భూపాల్‌శ్రీధర్ విద్యార్థులకు సూచించారు. మండల కేంద్రంలోని శ్రీచైతన్య కళాశాలలో బుధవారం డ్రగ్స్ నివారణపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి దశ ఎంతో విలువైనదన్నారు. ఈ దశను భవిష్యత్‌కు ఉపయోగపడే విధంగా మలుచుకోవాలని సూచించారు. మత్తు పదార్థాలకు అలవాటు పడి మధ్యలోనే జీవితాలను నష్టపోతూ కుటుంబసభ్యులకు బాధను కలిగిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు తప్పనిసరిగా డ్రగ్స్‌తో జరిగే నష్టాలను గుర్తించాలన్నారు. డ్రగ్స్ ఒక్కసారి తీసుకుంటే దానికి బానిసగా మారిపోతారన్నారు. డ్రగ్స్ వినియోగించినట్లుగా కాని అమ్మినట్లుగా కాని తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. డ్రగ్స్ వాడకం అనేది చట్టవిరుద్ధమని దీనిని గుర్తించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ ప్రదీప్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ శేఖర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హోటళ్లలో పరిశుభ్రత పాటించాలి

ప్రత్యేకాధికారి, తహసీల్దార్ కృష్ణయ్య



హోటల్ యజమానులతో మాట్లాడుతున్న తహసీల్దార్ కృష్ణయ్య తదితరులు

చేవెళ్ల: మండలంలో ఉన్న హోటళ్ల యజమానులు తమ హోటళ్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చేవెళ్ల ప్రత్యేకాధికారి, తహసీల్దార్ కృష్ణయ్య తెలిపారు. చేవెళ్ల గ్రామ పంచాయతీలో బుధవారం చేవెళ్లలోని హోటల్ యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపీడీఓ హిమబిందు, సీఐ భూపాల్‌శ్రీధర్, ఎంపీఓ విఠలేశ్వర్‌జీ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని హోటళ్ల యజమానులు నడుచుకోవాలన్నారు. కిచెన్‌లు ఎప్పుడు శుభ్రంగా ఉండాలన్నారు. హోటళ్ల నుంచి డ్రైనేజీ నీరు వెళ్లేందుకు ప్రత్యేక డ్రైన్ ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడేవిధంగా ఎవరైనా హోటళ్లను నిర్వహిస్తే వారిపై కఠిన చర్యలు ఉంటాయని చెప్పారు. ప్రతీ హోటల్‌లో తరచూ తనిఖీలు నిర్వహిస్తామన్నారు. పరిశుభ్రత పాటించకపోతే ఆ హోటళ్లను సీజ్ చేస్తామని హెచ్చరించారు. తడి, పొడి చెత్తను వేరుచేసి వేయాలన్నారు. హోటళ్లలో ఆహార పదార్థాలను నిల్వ చేయొద్దని, ఎప్పటికప్పుడూ వేడి చేసిన వాటినే అందించాలన్నారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్, సిబ్బంది నరేందర్, యాదయ్య, మండలంలోని అన్ని హోటళ్ల యజమానులు తదితరులు ఉన్నారు.

రుణమాఫీ సమస్యలపై వినతులు



రైతుల నుంచి సమస్యలు తెలుసుకుంటున్న ఏఓ అనురాధ

మొయినాబాద్‌రూరల్: మండలంలో రుణమాఫీ కాని రైతుల నుంచి వివిధ సమస్యల వినతులను స్వీకరిస్తున్నామని మండల వ్యవసాయ అధికారి అనురాధ పేర్కొన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆమె రైతుల నుంచి వినతులను స్వీకరిస్తూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు ముఖ్యంగా తమ ఆధార్‌కార్డు లింక్ లేకపోవడం, ఆన్‌లైన్ సమస్యలు ఉండడంతోనే రుణమాఫీ కాలేదని తెలిపారు. మండల పరిధిలో రెండు రైతు కేంద్రాల క్లస్టర్లు ఉన్నాయని, మీ గ్రామాలకు సంబంధించిన క్లస్టర్‌లలో అధికారులకు వినతులను సమర్పించి సమస్యలను వివరించాలని ఆమె పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అధికారులు ప్రతినిత్యం సమస్యల వినతులను స్వీకరిస్తారని తెలిపారు.

వివరాలు సరిచేసుకోవాలి

తహసీల్దార్ రవీందర్‌రెడ్డి



బీఎల్‌ఓలకు అవగాహన కల్పిస్తున్న రవీందర్‌రెడ్డి

కొత్తూరు: ఓటరు జాబితాలో ఏమైనా సవరణలు ఉంటే ఓటర్లు తమ వివరాలు సరిచేసుకోవాలని తహసీల్దార్ రవీందర్‌రెడ్డి కోరారు. ఇందులో భాగంగా బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆయన బీఎల్‌ఓలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అక్టోబర్ 18లోపు జాబితాలో పేర్లు, పుట్టినతేదీ, చిరునామాతో పాటు పలు తప్పులు ఉన్న ఓటర్లు తమ వివరాలను సరిచేసుకోవాలన్నారు. బీఎల్‌ఓలు తమ పరిధిలోని ఓటర్ల ఇంటికే వచ్చి వివరాలు పరిశీలిస్తారని పేర్కొన్నారు. అదే సమయంలో వివరాలు తప్పుగా ఉన్నవారు వారి దృష్టికి తీసుకొస్తే వెంటనే ఫోన్లలో దరఖాస్తు చేస్తారని తెలిపారు. రెండునెలల పాటు జరిగే ఈ ప్రక్రియలో బీఎల్‌ఓలు తమ పరిధిలోని ప్రతీ ఇంటికి వెళ్లి ఓటర్ల వివరాలను నమోదు చేస్తారని తెలిపారు. అంతేకాకుండా 18 ఏళ్లు నిండినవారు కొత్తగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీఎల్‌ఓలు, ఆయాశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ వ్యాపార సముదాయాలకు తాళం



తాళం వేసి ఉన్న దుకాణం

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని ఆర్టీసీ క్లాంప్లెక్స్‌లో ఉన్న వ్యాపార సముదాయాలకు అధికారులు బుధవారం సాయంత్రం తాళాలు వేశారు. అయితే దుకాణాల అద్దె కాలపరిమితి ముగియడంతో దుకాణాలకు తాళం వేసినట్లు డీఎం ఉషారాణి తెలిపారు. కోవిడ్ సమయంలో వ్యాపారాలు నడవకపోవడంతో దుకాణాలకు సంబంధించిన అద్దెను మరో ఏడాది పొడిగిస్తామని ఆర్టీసీ ఎండీ సజ్జనార్ అప్పట్లో ప్రకటించారని వ్యాపారులు తెలిపారు. అద్దెలు పెంచి ఇవ్వాలని, లేదంటే దుకాణాలను ఖాళీ చేయాలని అధికారులు హెచ్చరిస్తున్నట్లు వాపోయారు. ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి ఎమ్మెల్యే వినతిపత్రం కూడా అందజేసినట్లు పేర్కొన్నారు. ఇవేమి పట్టించుకోకుండా అధికారులు ఉన్నఫలంగా దుకాణాలకు నోటీసులు అతికించి, తాళాలు వేయడంతో తాము రోడ్డున పడ్డామని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సమర్థవంతమైన నైపుణ్యమే ప్రధానం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

మొయినాబాద్: విద్యార్థుల సంపూర్ణ అభివృద్ధికి సమర్థవంతమైన కమ్యూనికేషన్ నైపుణ్యమే ప్రధానమని జనగామ ఎమ్మెల్యే, అనురాగ్ విద్యాసంస్థల చైర్మన్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని చిలుకూరు రెవెన్యూలో ఉన్న కేజీరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం ఓరియంటేషన్ ప్రోగ్రాం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు రెగ్యులర్‌గా కళాశాలలకు హాజరై క్రమశిక్షణతో చదువుకుంటే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు. సాంకేతిక రంగంలో నైపుణ్యం పెంచుకునే విద్యార్థులకు అపారమైన అవకాశాలు, మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో కేజీరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ కె.కృష్ణారెడ్డి, డైరెక్టర్ రోహిత్ కందకట్ల, ప్రిన్సిపాల్ సాయి సత్యనారాయణరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఎంఎస్ నర్సయ్య, అధ్యాపకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

లీకేజీతో రోడ్డంతా బురదమయం

ఇబ్బంది పడుతున్న పాదచారులు, ప్రయాణికులు



లీకేజీతో చిత్తడిగా మారిన రోడ్డు

మొయినాబాద్‌రూరల్: మండలంలోని హిమాయత్‌నగర్ గ్రామం ఒకటవ వార్డులో గల జెడ్పీ పాఠశాలకు ఎదురుగా మంచినీటి పైపులైన్ లీకేజీ కావడంతో ఆ నీరు రోడ్డుపై ప్రవహిస్తూ గుంతల్లో నిలిచి రోడ్డంతా బురదమయమైంది. దీంతో పాదాచారులు, వాహనాదారులతో పాటు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ రోడ్డుపై వెళ్లాలంటే అవస్థలు పడుతున్నామని గ్రామస్తులు, విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి పైపులైన్ లీకేజీకి మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
జి. మల్లికార్జున్
9505507564